
# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం**

ఉదయం తొమ్మిది గంటలయ్యేసరికల్లా వంట చేయడం ముగించి తను చక్కగా ముస్తాబైపోయి "తొందరగా రండి. టిఫిన్ తిందాం" అంటూ హడావుడి చేశారు మంగమ్మగారు.

"సంగతేమిటీ?" అని చిరునవ్వుతో అడిగారు మంగపతిగారు.

"నేను ఇంగ్లీష్‌లో మాట్లాడ్డం నేర్చుకోవడానికి స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులో చేరాను. నెల్లాళ్లలో ఇంగ్లీషులో మాట్లాడ్డం నేర్పిస్తార్ట. లేకపోతే మనం కట్టిన డబ్బు తిరిగి ఇచ్చేస్తార్ట. ఫీజు పదిహేనువందలే లెండి. మనం అమెరికా బయల్దేరేసరికి భనాయించి ఇంగ్లీషులో మాట్లాడతాను చూసుకోండి. మీ కూతుళ్ళు అదిరిపోవాలి" ఉత్సాహంగా చెప్పారు మంగమ్మగారు.



# మంగమ్మగారు - ముప్పై రోజుల్లో ఇంగ్లీషు

**డా. తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం**

"శుభం! అంతకన్నా కావాల్సింది ఏముంది? నువ్వు శ్రద్ధగా నేర్చుకుంటే బ్రహ్మవిద్యేం కాదు ఇంగ్లీషులో మాట్లాడ్డం" మంగమ్మగారి నిర్ణయాన్ని హర్షించారు మంగపతిగారు.

★ ★ ★

ఆవిడ పన్నెండింటికల్లా తిరిగి వచ్చింది క్లాసునుండి.

భార్య ముఖం సంతోషంతో వెలిగిపోతుండడం గమనించిన మంగపతి గారు "వాళ్ళు చెప్తున్న పాఠాలు నీకు చాలా నచ్చినట్టున్నాయి. ఇంకో ఇరవై తొమ్మిదిరోజుల్లో నాకు పోటీగా తయారవుతావన్నమాట" అని నవ్వుతూ అడిగారు.

"యూ కీప్ యువర్ మౌత్ ఓపెన్ అండ్ సీయింగ్. ఐ ప్లే అమెరికన్స్ లైక్ దిస్" అన్నదావిడ చిటికెలు వేసి చూపిస్తూ.

"అదేమిటే? ఇక మీదట తెలుగులో మాట్లాడవా?" గాభరాగా అడిగారాయన.

"టాక్ ఇంగ్లీష్..లాఫ్ ఇంగ్లీష్..డూయింగ్ ఫామిలీ ఆల్సో ఇంగ్లీష్" అన్నదావి తన దృఢనిశ్చయాన్ని తెలియజేస్తూ. నోటమాట రానట్టు అలా భార్యకేసి చూస్తూ నిలబడిపోయారు మంగపతిగారు.

★ ★ ★

మర్నాడు సాయంత్రం మంగపతిగారి స్నేహితుడి కొడుకు భార్యను తీసుకుని వీళ్ల ఇంటికి వచ్చాడు. అతనికి వారం క్రిందటే పెళ్లయింది.

వచ్చిన క్రొత్త దంపతులకు ఫలహారం పెట్టి మర్యాదలు నెరిపిన మంగమ్మగారు ప్రేమగా అడిగారు "డూయింగ్ త్రీ స్లీప్స్ ఓవర్?" అని.


కాఫీ తాగుతున్న ఆ కుర్రవాడికి పొలమారింది. కొత్త పెళ్లికూతురి ముఖం సిగ్గుతో ఎర్రబడిపోయింది. మరో నిముషమైనా కూర్చోకుండా "వెళ్ళొస్తాం" అంటూ ఇద్దరూ బయటపడ్డారు.

వాళ్ళు వెళ్లిపోయాక మంగమ్మగారు చెప్పులు వేసుకుని బయల్దేరారు. "ఐ లిఫ్ట్ మై ఫ్రెండ్ నోట్స్" అని చెప్పి ఇంటికి ఫర్లాంగు దూరంలో ఉంటున్న వడ్లమూడి విమల గారింటికి వెళ్లిందావిడ.

చీకటి పడుతున్నా ఆవిడ రాకపోయేసరికి కాస్త కంగారుపడ్డారు మంగపతి గారు. తనే వెళ్లి తీసుకువద్దామా అని అనుకుంటుండగానే ఫోన్ మోగింది.


"నేనండీ! డోంట్ బర్న్ యువర్ హ్యాండ్. ఐయామ్ రైస్ కుకర్....ఐ కమ్ అండ్ డూ పచ్చడి..సింపుల్ చింతకాయ థౌజండ్, చిల్లీస్ థౌజండ్, కొత్తిమీర థౌజండ్, ఆల్‌పుట్ మిక్సీ అండ్ హండ్రెడ్...హండ్రెడ్.. సరేనా?" అని ఫోన్ పెట్టేసిందావిడ.

"మీరు చెయ్యి కాల్చుకోవద్దు. నేనొచ్చి అన్నం కుక్కర్‌లో పెట్టి చింతకాయ పచ్చడి చేస్తాను. ఏముంది? చింతకాయ వేయి, మిరపకాయలు వేయి, కొత్తిమీర వేయి అన్ని నూరు అంతేకదా" అని భార్య మాటల సారాంశమని అరగంట కష్టపడి డీకోడ్ చేసేసరికి పాపం మంగపతి గారికి తలనొప్పి వచ్చేసింది.



## అందుకే...

కొంతమంది తారలకు కొన్ని పాత్రలంటే అంతగా ఇంట్రెస్ట్ చూపించరు. మొన్నామధ్య ఓ చిత్రానికి సంబంధించి ఓ పాత్ర గురించి చాలా సేపు డిస్కషన్ జరిగిందట. ఆ పాత్రలో నటించడానికి ఆమె ససేమిరా అందిట. 'నాకు కొన్ని ఎమోషన్స్ ఉన్నాయి. ఆమాటకొస్తే ఎవరికైనా ఉంటాయనుకోండి. అయితే నామనసుకి నచ్చని పాత్ర వేయడానికి నేను ఎప్పుడూ వ్యతిరేకమే' అంటోంది సుస్. ఇంతకీ ఆమె కాదన్న పాత్ర ఆ చిత్రంలో వేయాల్సిన వేశ్య పాత్రట.




★ ★ ★

వారంరోజులు గడిచాయి. చెదరని పట్టుదలతో క్లాసుకు వెళ్తున్నారు మంగమ్మగారు. ఇంటికి ఎవరైనా వస్తే వాళ్ళని ఇంగ్లీషులో చావగొడుతున్నదావిడ. మంగపతిగారు ఒకప్పటి కొలీగ్ శంకరం గారి అమ్మాయికి పెళ్లి కుదిరింది. శంకరంగారి భార్య టీచర్‌గా పనిచేస్తోంది. వాళ్ళ అమ్మాయిది ప్రేమ వివాహం. అబ్బాయి తల్లిదండ్రులకు ఇష్టం లేదు. కొడుకు పట్టుబట్టడంతో ఒప్పుకున్నార్ట. అబ్బాయి వాళ్ళు స్థితిమంతులు.

కానీ కట్నం అడగకూడదని కండిషన్ పెట్టాడు పెళ్లికొడుకు.

మంగపతిగారిని పెళ్లికి పిలవడానికి వచ్చారు శంకరంగారు, ఆయన భార్య. వాళ్ళు రాగానే "డూయింగ్ గర్ల్స్ మ్యారేజ్ వాట్ చిల్డ్రన్ ప్లే... యూ ఆర్ క్లవర్ పీపుల్... యు క్యాచ్ ఎ గుడ్‌బాయ్" అంటూ గంపెడంత ముఖం చేసుకుని వారిద్దరినీ అభినందించారు మంగమ్మగారు.

ఆ దంపతులిద్దరూ చిన్నబోయిన ముఖాలతో సెలవు తీసుకున్నారు. "తెలివైనవాళ్ళు...కట్నం లేకుండా మంచి సంబంధం కొట్టేశారు" అనిపించుకున్నందుకు. వాళ్లతో బాటు గేట్ దాకా వచ్చిన మంగపతిగారు తన భార్య ముప్ఫైరోజుల్లో ఇంగ్లీష్ నేర్చుకోవడం గురించి వివరించి అపార్థం చేసుకోవద్దని వాళ్లని శాంతపరిచారు.

"నేను శంకరంగారితో మా శివరావుగారింటిదాకా వెళ్ళొస్తాను" అని ఒక కేకపెట్టి వాళ్ళ వెంట బయల్దేరి వెళ్లాడాయన.

"కమ్ బిలో ఎయిట్ ఓ క్లాక్.. ఎబౌవ్ నైన్ ఫుడ్ డోంట్ ఫాల్ యువర్ బాడీ..." అని జాగ్రత్త చెప్పారు మంగమ్మగారు.

★ ★ ★

రోజూ పొద్దున్నే లేచి హడావుడిగా తొమ్మిదింటిలోపు వంటపని, టిఫిన్ చేదయడం ముగించాలంటే రానురాను మంగమ్మగారికి కష్టంగా అనిపించింది. అందుకే ఆవిడ ఒకరోజు ఉదయాన్నే భర్తకు చెప్పేసింది. "ఏవండీ! ఐ వాంట్ టు కీప్ ఎ కుక్ అండ్ యు పుట్ ఎ డ్రైవర్" అంటూ.

"ఒక నెల్లాళ్ళ కోసం ఎవరు పనిచేస్తారే? సరే చూద్దాం" అన్నారాయన నవ్వుకుంటూ. వడ్లమూడి విమలగారు తనకు తెలిసిన వంటావిడను మంగమ్మగారింటికి పంపింది.

"ఇదిగో! నువ్వుగానీ ఆ వంట మనిషితో ఇంగ్లీషులో మాట్లాడావంటే నీకు వచ్చినంత ఇంగ్లీషు ఆవిడ ఏ క్లాసుకూ వెళ్లకుండానే నేర్చేసుకుంటుంది. జాగ్రత్త" అంటూ ముందుగానే భార్యను హెచ్చరించారు మంగపతిగారు.

వంటావిడను అదుపులో పెట్టడానికి మంగమ్మగారు గనుక "యువర్ డాల్ నాట్ బాయిల్ ఇన్ దిస్ హవుజ్" అని గానీ అంటే ఆ వంటావిడ కాస్త పచ్చి కందిపప్పు కంచంలో వడ్డిస్తుందేమోనన్న కంగారు ఆయనకు.

★ ★ ★

ఆ మరుసటిరోజు సాయంకాలం భర్తతో సహా వడ్లమూడి విమలగారింటికి వెళ్లి వంటమనిషిని పంపినందుకు కృతజ్ఞతలు తెలిపారు మంగమ్మగారు.

పెద్దాయన ఇంటికి వచ్చాడు కదా అని "వుండండి. కాఫీ కలిపి తీసుకువస్తా" అంటూ వంటింట్లోకి వెళ్ళబోయింది విమల.

"నో...నో...డోంట్ టేక్ రిస్క్. హి ఈజ్ ఆల్‌రెడీ డ్రంక్" అంటూ ఆవిడను ఆపేసింది మంగమ్మ.

బయటకు వచ్చాక పెళ్ళాన్ని చీవాట్లు వేశారు మంగపతిగారు.

"నీ ఇంగ్లీష్ థేమ్సురివర్‌లో ముంచా! కాఫీ, టీ తప్ప మరొకటి ముట్టుకోని నన్ను పట్టుకుని డ్రంక్ అంటూ తాగి ఉన్నాడని అంటావుటే?" అంటూ.

"హయ్యోరామా! సారీ అండీ. కాఫీ తాగేశారు అని చెప్పడానికి అలా అన్నానంతే" అంటూ బాధపడిపోయింది మంగమ్మగారు.

"అమ్మా కాఫీపొడి అయిపోయింది కొనాలి అన్నారు. పద్మశ్రీ కాఫీ పొడి ముందు ఆపమంటారా?" అంటూ అడిగాడు అంతవరకూ వాళ్ల మాటలు వింటున్న డ్రైవర్. మంగమ్మగారికి అతడి మీద చాలా కోపం వచ్చేసింది.

"ఐ టాక్...హి టాక్..సెంటర్ సెంటర్ డోంట్ టాక్" అంటూ డ్రైవర్‌కి వార్నింగ్ ఇచ్చేసింది. ఆ మాటలు విన్న మంగపతిగారికి నవ్వొచ్చింది.

"కోప్పడకే... కాఫీ పొడి లేకపోతే రేపు మీ కుకింగ్ ఉమన్ 'నోకాఫీ..నో మీల్స్' అంటుంది జాగ్రత్త" అన్నారు నవ్వుతూ.

★ ★ ★

"ఇవాళ సాయంకాలం పుస్తకాల షాపునకు వెళ్లి కొన్ని పుస్తకాలు కొనాలండీ" అంది మంగమ్మగారు ఆరోజు క్లాసునుండి రాగానే.

"అదేమిటి? మళ్లీ పూర్తిగా తెలుగులో మాట్లాడ్డం మొదలుపెట్టావ్?" ఆశ్చర్యంగా అడిగారు మంగపతి.

"మీరు మాట మాటకూ తప్పులు పడుతున్నారుగా...అదే నా కూతుళ్లయితే 'అమ్మ ఈ పదిహేనురోజుల్లో ఎంత ఇన్‌ఫ్లేట్ అయిందో' అని నన్ను మెచ్చుకునేవారు" కినుకగా అందావిడ.

"నువ్వు సరిగ్గా మాట్లాడితే నేను మాత్రం గర్వపడి మెచ్చుకోనా ఏంటి? నువ్వు నిజంగానే ఈ పదిహేనురోజుల్లో ఇంప్రూవ్ అయ్యావులే. ఇక ఇన్‌ఫ్లేట్ మాత్రం కావొద్దు" అంటూ ఆవిడ అప్పటికే లావుగా ఉన్నదన్నట్టు చేతులతో చూపుతూ నవ్వారు. మంగమ్మగారు అలిగి మూతి ముడుచుకుని కూర్చుంది.

"నేను ఏవో అంటానని నువ్వు ఇంగ్లీషులో మాట్లాడ్డం మానొద్దు. వాళ్ళు మళ్ళీ నీ ఫీజు తిరిగి ఇవ్వాల్సి వస్తుంది" అంటూ హెచ్చరించారు.

అనుకున్నట్టుగానే పుస్తకాల షాపుకి వెళ్లారు. ఆవిడ వెదకి వెదకి కొన్ని పుస్తకాలు ఎంపికచేసుకుని బిల్లు వేయమంది. అంతలో అటుగా వచ్చిన పని కుర్రాడిని చూడగానే కోప్పడిందామె "ఐ ఆస్క్ యుడ్రింక్ వాటర్... యు డోంట్ కేర్" అంటూ. ఆవిడ అడుగుతున్నదేంటో అర్థంకాక బిక్కముఖం పెట్టాడా అబ్బాయి. పనిగట్టుకుని తనని మంచినీళ్ళు త్రాగమని ఎందుకడుగుతున్నదో అర్థంకాలేదు పదోక్లాసు తప్పిన ఆ అబ్బాయికి. ఆవిడ కొన్ని పుస్తకాలను బట్టి పరిస్థితి అర్థమైన షాపు యజమాని "ఆవిడ మంచినీళ్ళు కావాలని అడిగితే ఏంచేస్తున్నావూ? పట్టుకురా వెళ్లి" అంటూ వాడిని కసిరాడు.

"మీకు కూడా ఇంగ్లీషు బాగా వచ్చునన్నమాట" అన్నట్టుగా దుకాణం యజమాని వైపు మెచ్చుకోలుగా నవ్వింది మంగమ్మగారు.

ఊళ్ళోకి హ్యాండీక్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ వచ్చింది. వస్తువులు చీరెలు అన్నీ బాగున్నాయంటూ మంగమ్మగారికి వార్తలందాయి.

"వెళ్లి చూసొద్దాం. ఖరీదు ఎక్కువైనా కళాత్మకంగా ఉన్నాయిట" అంది జనార్థనం భార్య మంగమ్మగారితో.

"మీకేమమ్మా? యువర్ హజ్బెండ్ స్ట్రాంగ్. యు ఆల్సో డబుల్ స్ట్రాంగ్... హి గెట్స్ మనీ ఎబౌవ్ టేబుల్ అండ్ బిలో టేబుల్..మై హజ్బెండ్ రిటైర్డ్" అన్నారు మంగమ్మగారు. ఆవిడలా ముఖం మీదే తమ లావు శరీరాల గురించీ, లంచాల గురించీ అనేయడం జనార్థనం భార్యకు నచ్చలేదు.

"మీకేం తక్కువ? పిల్లల పెళ్ళిళ్ళు చేసేశారు" అందావిడ.

అంతటితో ఆగక "మా బాధ్యతలు, ఖర్చుల గురించి ఏం చెప్పాలిలెండి" అని నిట్టూర్చింది.

"బాగుందమ్మా సాల్ట్‌మాన్ క్రెస్. డాల్‌మాన్ క్రెస్.. స్వీట్‌రైస్ మాన్ హికప్ క్రెస్ అన్నట్టుంది" అనేశారు మంగమ్మగారు.

ఆవిడ అనువాదం విన్న మంగపతిగారు జనార్థనం గారూ నవ్వేశారు.

వాళ్ళు వెళ్లిపోయాక "ఎందుకు నవ్వారు?" అంటూ మొగుణ్ణి నిలదీశారు మంగమ్మగారు. "మరి నువ్వు మాట్లాడే ఇంగ్లీషు అలా వుంది. తెలుగుని యథాతథంగా ఇంగ్లీషులోకి మారిస్తే అది తెంగ్లీష్ అవుతుంది గానీ ఇంగ్లీష్ కాదు" అన్నారాయన.

"అయితే ఒక పనిచేస్తాను. మనం అమెరికా వెళ్లేది ఏప్రిల్‌లో కదా. ఇంకా రెండు నెలలు సమయముంది ఇంకో పదిహేనువందలు కట్టి మరో మూప్పైరోజులు క్లాసులకు వెళ్తాను. అప్పుడు కరెక్ట్ ఇంగ్లీష్ మాట్లాడ్డం వస్తుంది. సరేనా?" అన్నదావిడ ఉత్సాహంగా.

ఆవిడకు ఏం జవాబు చెప్పాలో తెలీక "అలాగే కానీ. కాదంటే యు విల్ వాష్ అండ్ ఐరన్‌మీ" అంటూ నవ్వేశారు మంగపతిగారు.

★

## భూకంపం

భూకంపం గురించి తెలియజేయడానికి గోల్డ్‌ఫిష్ అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. భూకంపం ముందు వచ్చే ప్రకంపనలు, శబ్ద తరంగాలని అవి గ్రహించి భూకంపం వచ్చే విషయం సంగ్రహించి వింతగా ప్రవర్తిస్తాయి. అందువల్లనే జపాన్ దేశస్థులు ఈ గోల్డ్‌ఫిష్‌ను ఎక్కువగా పెంచుతుంటారు.

## రక్తదానం

అన్ని దానాల్లోకెల్లా గొప్పది రక్తదానం. హరీష్‌బూటా అనే 34 సంవత్సరాల మధ్య వయస్సుగల ఇన్సూరెన్స్ అధికారి అయిన ఈ వ్యక్తి వందసార్లకుపైగా రక్తదానం చేసి ఆనాటి మహారాష్ట్ర గవర్నర్ లాబీబ్ చేతులమీదుగా వజ్రపు ఉంగరాన్ని అందుకున్నారు.

## విచిత్రమైన సంఖ్య

ఉత్తరప్రదేశ్‌లోని ఒక మాజీ మంత్రిగారికి 2520 అనే నెంబరంటే మహా ఇష్టం. దానికి కారణం ఆ నెంబర్‌ని ఒకటి నుండి పదివరకు ఏ అంకెతోనైనా భాగించవచ్చు. అలా భాగించి చూడండి. మీకే తెలుస్తుంది విచిత్రమైన సంఖ్య విశేషం.

-పి.వి.రమణకుమార్

